జాతీయస్థాయి చిన్న కథల పోటీలలో
ప్రత్యేక సోమేపల్లి పురస్కారం పొందిన కథ

# ఆశావహం



స్కూళ్ళకు వేసవి సెలవులిచ్చారు.

చెన్నై నుంచి మనవరాలు మంజూష, బెంగుళూరు నుంచి మనవడు విశ్వక్ వచ్చారు.

ఒకరికి ఏడేళ్ళు, రెండోవారికి అయిదేళ్ళు.

ప్రతి సెలవుల్లోనూ ఆటవిడుపుగా ఉంటుందని మా అబ్బాయీ అమ్మాయీ వాళ్ళని తీసుకుని మా దగ్గరకు వస్తూంటారు.

ఆ సెలవుల్ని ప్రయోజనాత్మకంగా ఉండేలా ప్లాన్ చేస్తూంటాను.

ఒకసారి వరంగల్ తీసుకెళ్ళి వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయాల శిల్ప సౌందర్యాన్ని చూపించాను. మరోసారి భద్రాచల రాముడ్నీ గోదావరి సోయగాల్నీ దర్శింపజేశాను. ఇంకోసారి సాలార్‌జంగ్ మ్యూజియంలోని కళాఖండాలని పరిచయం చేసాను.

అసలంచేతే వాళ్ళు మా దగ్గరకి ఉరుకుతూ వస్తారంటే అతిశయోక్తి కాదు. ఇక వారి మామ్మ చేసి పెట్టే సున్నుండలు, పాకుండలు, జంతికలు, బొబ్బట్లు లాంటి చిరు తిండ్లు అంటే వారికి ప్రత్యేక ఇష్టం.

"తాతా! సమ్మర్ స్పెషల్ ప్రోగ్రాం ఏంటి?" వస్తూనే అడిగింది మంజూష.

"సర్కస్‌కెళదాం తాతయ్యా" అన్నాడు విశ్వక్.

పెదవి విరిచాను. "సర్కస్‌లో జంతువులేమీ ఉండట్లేదురా, మనుషులే రకరకాల విన్యాసాలు చేస్తున్నారంతే"

"మరి ఆ జంతవుల్నేం చేశారు! జూలో పెట్టేశారా?" తిరిగి వాడే అడిగాడు.

"నీకేం తెలీదు ఫో. వాటిని అడవుల్లో వదిలేసి ఉంటారు" మంజూష అంది.

"అడవుల్నీ నరికేస్తున్నారు కదమ్మా"

"అయ్యో! మరైతే పాపం యానిమల్సూ బర్డ్సూ ఎక్కడుంటాయి తాతయ్యా ?" చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ అడిగింది.

"అడవులు తగ్గిపోతూండటం వల్ల అరుదైన జాతి పక్షులూ జంతువులూ వేగంగా అంతరించిపోతున్నాయి. గాలిలో కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువవుతోంది. వర్షాలూ సరిగ్గా కురవట్లేదు. దాంతో తాగునీటికి కటకట ఏర్పడింది......"

"వెరీ బ్యాడ్. చెట్లను కాపాడుకోవాలని మా మేడమ్ చెప్పింది"

తలాడించింది మంజూష. "చెట్లనీ అడవుల్నీ రక్షించుకోవాలి. అప్పుడే అన్ని ప్రాణులూ హ్యాపీగా ఉంటాయి"

"కరెక్ట్. ఈసారి జూకెళ్దాం" అన్నాను.

"జూలో లేనివి కూడా బోల్డన్ని యానిమల్స్ డిస్కవరీ ఛానల్లో చూశాను" అని మంజూష అంటే, "నేనూ చూశాను తాతయ్యా" అన్నాడు విశ్వక్.

నవ్వేను. "మీరు అడవుల్లో ఉండే జంతువుల్ని చూశారు. వాటి స్వరూప స్వభావాలూ ప్రకృతీ పద్ధతులూ మీకు కొట్టిన పిండే. కాని మీకు తెలీని చూడని వింత జంతువులు చాలా వున్నాయి"

"వింత జంతువులా?" ఇద్దరూ ఒక్కసారే ఆశ్చర్యబోయి నోరెళ్ళబెట్టారు.

"వాటిని జంతువులనకూడదని ఈ మధ్య జంతుప్రేమికులు గొడవ చేశారు దాంతో వాటిని రాక్షసులంటూ రిఫర్ చేస్తున్నారు"

"మరప్పుడు రాక్షసులేమీ అనరా?"

"ఊహూ. వాళ్ళూ వీళ్ళూ ఒకే తాను గుడ్డలు!"

"భలే భలే. ఇవాళే వెళ్ళి చూసేద్దాం తాతయ్యా" తప్పట్లు కొట్టాడు విశ్వక్.

మంజూష సీరియస్‌గా ఆలోచిస్తోంటే, "అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావేంటి తల్లీ" అనడిగాను.

"తాతా! ఆ వింత మృగాలకి ఎన్ని తలలుంటాయి, ఎన్ని కాళ్ళూ చేతులూ ఉంటాయి? తలమీద కొమ్ములుంటాయా? నోటి దగ్గర కోరలుంటాయా? చింపిరి జుట్టుతో బాన పొట్టతో నల్లగా లావుగా వికారంగా ఉంటారా?"

"మామూలప్పుడు మామూలుగానే వుంటాయి. ఒక్కోసారి అమాంతం వికృతంగా మారిపోతూంటాయి"

"మారీచుడు మాయలేడిగా మారినట్టా?"

మంజూష ప్రశ్నకి అవునంటూ తలాడించాను.

"అమ్మో, రాక్షసులా! మనల్ని పీక్కుని తినేస్తాయేమో! నాకు భయమేస్తోంది తాతయ్యా!" అన్నాడు విశ్వక్ నన్ను గట్టిగా పట్టుకుని.

"భయమెందుకురా. అవి బయటకి రాలేవు. కేజెస్‌లో పెట్టి లాక్ చేస్తారు. కదా తాతయ్యా" ఆరిందాలా అంది మంజూష.

"కొందర్నే పెట్టారు. అందర్నీ పెట్టాలంటే ప్రభుత్వం వల్ల కాదు"

"మరెవరు పెట్టాలి?"

"మీరే. ఇప్పుడు కాదులే పెద్దయ్యాకేలే....."

ఇంకేదో అనుమానం రాగా అంది. "నాదో డౌట్ తాతయ్యా. ఆ రాక్షసులేం తింటారు? మాంసం తిని రక్తం తాగుతారా?"

"అంతకంటే ఘోరంగా మానవజీవితాల్నే నమిలి మింగేస్తున్నారు!"

అయోమయంగా చూశారిద్దరూ.

"కొంచెం ఓపిక పట్టండి. వాటిని ప్రత్యక్షంగా చూసి తెలుసుకుందురుగాని"

"వాటికి నాలుగు కాళ్ళుంటాయా ఆరుకాళ్ళుంటాయా?" అని విశ్వక్ అనుమానం వ్యక్త పరిస్తే, "అవి నేల మీద నడుస్తాయా గబ్బిలంలా తలక్రిందులుగా వేలాడతాయా?" ఉత్సుకతతో అడిగింది మంజూష.

"చూశాక చెబుదురుగాని ఎలా ఉంటాయో ఏం తింటాయో. అసలీ భూమ్మీద ఉండొచ్చో ఉండకూడదో!"

మరింత అయోమయంలో పడ్డట్టు వారి మొఖాలే చెప్పాయి. 'ఆలోచించనీ' అనుకుని ఊరుకున్నాను.

"ఎప్పుడెళ్దాం తాతా"

"ఆదివారం"

పొంగిపోయి తప్పట్లు కొట్టారు. అంతటితో ఊరుకోలేదు. జూకి వెళ్ళి వింత జంతువుల్ని చూస్తామంటూ ఇంట్లో టాం టాం వేసేశారు. వాటికేం పెట్టాలో ఏమని పిలవాలో వాటికర్థమయ్యేలా ఏమేం చెప్పాలో చేయాలో కూడబలుక్కోసాగారు.

"పిల్లలు వికృతజీవుల్ని చూస్తామంటున్నారేంటి నాన్నా. ఇతర గ్రహవాసుల్నేమైనా బంధించి జూలో పెట్టారా?" మా అమ్మాయి ఆసక్తిగా అడిగింది.

ముసి ముసిగా నవ్వేను. "మన గ్రహవాసులేనమ్మా. చూసొచ్చాక ఏం చెబుతారో విందువుగాని"

"భయపడి జ్వరం తెచ్చుకుంటారేమోనని.......!"

"భయపడరుగాని జాగ్రత్త పడతారు. రాక్షసులెలా ఉంటారో తెలుసుకుంటారు"

"ఈ కాలంలో రాక్షసుల్ని ప్రత్యక్షంగా చూడటమా? మీ మాటలు నాకేం అర్థం కావట్లేదు నాన్నా"

"అర్థమవ్వాల్సింది నీకూ నాకూ కాదు, రేపటి తరానికి"

"తరాల గురించి మాట్లాడుతున్నారేంటి" అంటూ వచ్చాడు కొడుకు.

"జూలో కొత్త రకం ప్రాణుల్ని ప్రదర్శనకి పెట్టార్ట. పిల్లల్ని తీసుకెళ్ళి చూపిస్తానంటున్నారు నాన్న......" కూతురు వివరించింది.

"అలాగా. అయితే మనమూ వెళ్దాం. అలాటివి చూస్తేనే మన జీకే పెరిగేది.....!"

"నాగార్జునగారి కోటీశ్వరుడు అయిపోవచ్చునా!" నవ్వేడు అల్లుడు.

తనూ శృతి కలుపుతూ, "అమ్మ ఏమంటుందో రా....." అంది మా అమ్మాయి.

మాటల్లోనే వచ్చింది రమణి. సంగతి విని "ఏకంగా పిక్నిక్ ప్రోగ్రాం వేసుకుందాం. పులిహోర, చక్రపొంగలి చేసేస్తాను"

"మా అమ్మ అప్పుడే మెనూలోకి వెళ్ళిపోయింది!" నవ్వేడు మా అబ్బాయి.

“ఇక ఈ క్షణం నుంచే ఆ ఏర్పాట్లలో ఉంటుంది. రుచిగా వండి అందరికీ తృప్తిగా వడ్డిస్తేగాని తనకి తృప్తి ఉండదు” అన్నాను నవ్వుతూ.

“నవ్వులు తర్వాత. రేపు రైతుబజారు కెళ్ళి అన్ని రకాల పండ్లూ కొని తెండి. అల్లుడిగారి కోసం ఇంకేమైనా స్పెషల్స్ చెయ్యనా?”

“బావగారు ధమ్ బిర్యానీ కావాలంటారు” అక్క వైపు చూస్తూ కొంటెగా నవ్వేడు మా అబ్బాయి.

“ఎన్వీ ఇష్టమేగాని బొమికలు మెళ్ళో కట్టుకోరు. పిక్నిక్‌లోనూ బిర్యానీలు కావాలనేం కలవరించరు. మరదలికి తినాలనుంటే చెప్పు హొటల్ నుంచి తెప్పిస్తాను” నవ్వుతూనే చురక వేసింది కూతురు.

“మీరూ మీరూ ఒకటి. నేనూ మా అన్నయ్యగారే కదా పరాయివాళ్ళం. మీకు సంతోషంగా ఉంటుందంటే మా మీద ఎన్ని జోకులైనా వేసుకోండి మేమేం అనుకోం” అన్నది కోడలు చిన్నగా నవ్వుతూ.

“నేనస్సలు అనుకోను. నా చర్మం చాలా మందం” అన్నాడు అల్లుడు బిగ్గరగా నవ్వుతూ.

ఇంట్లో నవ్వులు వెలుగుపూలయ్యాయి.

నా కళ్ళు చెమ్మగిల్లాయి. మనుషుల మధ్య ఆప్యాయత, అనురాగం, అవగాహన, అన్యోన్యత, అభిమానం, ఆదరణ ఉంటే చాలు ఇల్లే కాదు సమాజం, దేశం కూడా ఒక ఆనందనిలయం అయి తీరుతుంది.

కొందరు ఎందుకా సంగతి గ్రహించక వక్ర మార్గాన పోతారో తెలీదు! అమానుషంగా ఎందుకు ప్రవర్తిస్తారో తెలీదు!

డబ్బు, తాత్కాలిక సుఖం, అధికారం, అహం, గర్వం కన్నా మిన్నయైనవి చాలా ఉన్నాయని గ్రహించగలిగితే ఎంత బావుణ్ణు!

నైతిక విలువలకు సామాజిక జీవనానికి పెద్ద పీట వేస్తే ఎంత బావుణ్ణు!

మానవత్వపు పరిమళాలు వెదజల్లితే మరింత బావుణ్ణు! ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తినందుకు సార్ధకం చేసుకోగలిగితే ఎంతెంతో బావుణ్ణు!

నిట్టూర్చాను.

ఆదివారం నాడు ఇంటిల్ల పాదీ రెండు కార్లలో జూ కెళ్ళాం.

మంజూష, విశ్వక్ పోటీపడి మరీ రెండు టిఫిన్ బాక్సులు ప్రత్యేకంగా సర్దించుకున్నారు. వింత జంతువులకు పెడతామంటూ వివిధ పండ్లముక్కలు వాటిల్లో పెట్టించుకున్నారు. కొత్త అనుభూతి పంచుకోడానికి ఉవ్విళ్ళూరుతున్నారు. ఉద్విగ్నంగా

ఉన్నారు.

జూ దగ్గర జనం పోటెత్తినట్టుగా ఉన్నారు.

"అబ్బ! ఇంత జనమేంటయ్యా" టిక్కెట్లు తీసుకుంటూ కౌంటర్లో అతన్ని అడిగాను.

"కొత్తరకం జంతువుల్ని చూట్టానికి జనం ఎగబడుతున్నారు"

"మంచిదే. పులులూ సింహాలూ నక్కలూ తోడేళ్ళూ అడవుల్లోనే ఉంటాయి. ఈ కొత్తవి జనారణ్యంలో ఉంటున్నాయి. అంతా చూడాల్సిందే. తెలుసుకోవాల్సిందే. విరుగుడు ఆలోచించాల్సిందే"

అంతా లోపలికెళ్ళాం. మొదటి బోను దగ్గర ఆగాం.

లోపల ఒక నడివయస్సావిడ ఉంది. మొహం క్రూరంగా ఉంది. జుట్టు విరబోసుకుంది. పెద్ద పొట్టతో వికృతంగా ఉంది.

టిఫిన్ బాక్సులు తెరవబోయి ఆగిపోయారు మంజూష, విశ్వక్.

"రామాయణంలోని తాటకా?" మంజూష ప్రశ్నించింది.

"రాక్షసి అత్త" విశ్వక్ బోర్డు చదివేడు.

బోర్డులో రాసిన వివరాలు చదివి అన్నాడు కొడుకు "కట్నం కోసం కోడల్ని రాచి రంపాన పెట్టిందిట. ఎన్నో రకాలుగా హింసించి కడకో రోజున కోడలు నిద్రపోతూండగా కిరసనాయిలు పోసి నిప్పంటించి చంపేసిందట!"

"బాపురే!" గుండెల మీద చేతులుంచుకున్నారు పిల్లలు.

"ఆ చూపులు చూడండి. తోడేలులా లేదూ?" రమణి మాటలకు తలలాడించారంతా.

అసహ్యంగా చూసి అక్కడ్నుంచి కదిలారు పిల్లలు.

తర్వాతి కేజ్‌లో ఒక యువకుడున్నాడు. పాతికేళ్ళు మించి ఉండవ్. అచ్చం గుంటనక్కలా ఉన్నాడు.

"నక్క ప్రేమికుడు – అంటే ఎవరు తాతా" బోర్డు మీది పేరు చదివి మంజూష అడిగింది, టిఫిన్ బాక్సు బ్యాగ్‌లో దాచేస్తూ.

"టెన్త్ నాలుగుసార్లు తప్పిన వీడు ఇంజినీరింగు చదువుతోన్న అమ్మాయిని ప్రేమించమంటూ వేధించాట్ట. ఆమె తిరస్కరించేసరికి ఆమె మొఖం మీద యాసిడ్ పోశాట్ట!" కూతురు వివరించింది.

"వాడిది రాక్షస ప్రేమా?"

"అది ఏ రకమైన ప్రేమా కాదు. వికృత మనస్తత్వం. మగ దురహంకారం. అంతే" వివరించాను.

వాడ్ని గొంగళి పురుగులా చూసి 'ఛూ' అని ఊశారు. మరో చోటుకెళ్ళాం.

ఇంకో బోనులో ఇద్దరు కుర్రాళ్ళున్నారు. 'రేపిస్ట్స్' అని బోర్డు మీద రాశారు.

"వీళ్ళు పరమరాక్షసులు. పదేళ్ళ పిల్లని దారుణంగా చెరచి చంపేశారు. ఇలాంటి వాళ్ళని చూడటం కూడా పాపమే. పదండి పదండి....."

"వీళ్ళని ఉరితీయకుండా ఇందులో పెట్టి అన్నం ఎందుకు పెడుతున్నారు తాతయ్యా?" మంజూష ప్రశ్న కాదు ఫిరంగి పేల్చింది.

"గన్ ఉంటే ధన్ ధన్ మని కాల్చి చంపేద్దును" మనవడన్నాడు.

ప్రక్కనే పిడుగు పడ్డట్టు మ్రాన్పడిపోయామంతా.

"కొత్త జంతువులకు పెడతామని ఏవో చిరుతిండ్లు తెచ్చేరుగా!" సాభిప్రాయంగా చూస్తూ అన్నాను.

"పెట్టం. ఎవరూ పెట్టకూడదు. వీళ్ళు ఆకల్తో మాడి చావాలి!" విషపు చూపుల చురకత్తుల్తో వారిని చీల్చి చెండాడేస్తూ ఒకేసారి అన్నారు మంజూష, విశ్వక్.

జాతి భవిష్యత్తు ఆశాజనకంగా కన్పిస్తోంటే వారి వంక అభినందనపూర్వకంగా చూశాను.

*    *    *

**(రమ్యభారతి– ఫిబ్రవరి 2016)**